
# రూటు మారిన ట్రిపుల్ ఆర్


మొదటిపేజీ తరువాయి...

ఉత్తర, దక్షిణ భాగాలకు సంబంధించిన అలైన్‌మెంట్ ప్రతిపాదనలు కూడా కేంద్రానికి వెళ్లాయి. అందులో భాగంగా తొలుత ఉత్తర భాగం సంగారెడ్డి (ఎన్‌హెచ్-65 మీదుగా) - తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ (ఎన్‌హెచ్-65 మీదుగా) వరకు 158 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ నిర్ధారణ జరిగింది. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఆరోపణలు గానీ, అనుమానాలుగానీ రాలేదు. దక్షిణ భాగంలో అలైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రాథమిక దశ కసరత్తు పూర్తయ్యింది. ఆ మేరకు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మ్యాపునూ విడుదల చేశారు. అందులో దక్షిణభాగం వైపు ట్రిపుల్ ఆర్ ఎలా వెళ్తుందనే వివరాలు కూడా ఉన్నాయి. కాకపోతే దానిని అధికారికంగా సర్వే చేసి నిర్ధారించాల్సి ఉంది. ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం వాస్తవానికి 189 కిలోమీటర్లుగా గతంలోనే నిర్ధారించారు. ఎన్‌హెచ్-65 మీదుగా చౌటుప్పల్ నుంచి షాద్‌నగర్- ఆమన్‌గల్ సమీపంలో నుంచి చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు రింగును కలపాల్సి ఉంది. గతంలో అధికారికంగా విడుదల చేసిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మ్యాపులోనూ ఇదే రీతిన అలైన్‌మెంట్ ఉన్నది. కానీ కొంతకాలం కిందటి నుంచి అలైన్‌మెంట్‌లో మార్పులపై ప్రభుత్వ పెద్దల స్థాయిలో అంతర్గతంగా తర్జనభర్జనలు జరిగినట్టు తెలిసింది. ఈ మేరకు ఏకంగా నాలుగు కిలోమీటర్ల మేర పొడిగింపుతో పలు చోట్ల అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు.



- చౌటుప్పల్ నుంచి అలైన్‌మెంట్‌ను గతంలోని పాయింట్ నుంచి 5 కిలోమీటర్ల అవతలకు జరిపారు. ఫలితంగా తక్కళ్లపల్లి- చినమాద్గుల - ఆమన్‌గల్- కొందుర్గు- చెంగోముల్- చేవెళ్ల- కొండాపూర్- సంగారెడ్డి వరకు ఉండే అలైన్‌మెంట్ దూరం జరిగింది.
- భట్లపల్లి దగ్గర మొదలై కొద్దిదూరం గత అలైన్‌మెంట్ మాదిరిగానే కొనసాగినా... ఆపై నల్లగొండ జిల్లాలో తక్కళ్లపల్లి నుంచి కిష్టరాంపల్లి వైపునకు జరిగింది. అలా శివన్నగూడ మీదుగా పోవాల్సిన అలైన్‌మెంట్ కురంపల్లి ఎక్స్ రోడ్డు-నల్లచెరువు మీదుగా వెళ్లింది.
- రంగారెడ్డి జిల్లాలో నాగిళ్ల నుంచి ఆమన్‌గల్, ఆకుతోటపల్లి లోపల నుంచి తలకొండపల్లి వైపు పాత అలైన్‌మెంట్ ఉన్నది. ఇక్కడ భారీ ఎత్తున మార్పు చేపట్టారు. ఇందులో నల్లచెరువు-సింగంపల్లి మీదుగా ఆకుతోటపల్లి బయటి చాలా దూరం నుంచి తలకొండపల్లి వరకు అలైన్‌మెంట్‌ను మార్చారు.
- అలైన్‌మెంట్‌లో తలకొండపల్లి నుంచి కిలోమీటర్ల దూరం వరకు మార్పులు చేశారు.
- ఇక సేరిరామకృష్ణాపురం నుంచి చౌలపల్లి వరకు ఎలాంటి మార్పు లేకుండా పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించారు.
- చౌలపల్లి నుంచి ఏదురుగూడెం వరకు పాత అలైన్‌మెంట్‌లో భారీ మార్పులు చేశారు. టేకులపల్లి-మీర్జాగూడ-చెంగోముల్ గ్రామ సమీపంలో నుంచి సంకేపల్లి మీదుగా వెళ్లాల్సిన అలైన్‌మెంట్ తుమ్మలపల్లి-చిన్న ఉమ్మెంతాల-తిప్పాపూర్-ఆపై చెంగోముల్ పోలీస్‌స్టేషన్ మీదుగా పులిమామిడి, హరిదాస్‌పూర్ మీదుగా సంగారెడ్డికి తీసుకువెళ్లారు. చెంగోముల్ గ్రామం నుంచి పోలీస్‌స్టేషన్ సుమారు ఐదు కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. అంటే అలైన్‌మెంట్‌ను నాలుగైదు కిలోమీటర్ల మేర అవతలికి జరిపారు.
- గత అలైన్‌మెంట్‌లో ఎక్కడా సాంకేతిక సమస్యలు లేవు. సర్వేనే పూర్తికానందున భూసేకరణ సమస్య తలెత్తినట్టుగా చెప్పలేం. అలైన్‌మెంట్ మార్పు వెనక భారీ వ్యూహం ఉన్నదనేది స్పష్టం. ఫోర్త్‌సిటీ కోసం అలైన్‌మెంట్ మార్చినట్టుగా ప్రభుత్వ పెద్దలు బయట ప్రచారం చేస్తున్నప్పటికీ.. గత అలైన్‌మెంట్ మాత్రమే ఫోర్త్ సిటీకి సమీపంలో ఉన్నది. తాజా అలైన్‌మెంట్ నాలుగైదు కిలోమీటర్ల దూరం పెరిగింది. దీంతో మార్పు వెనక ఉద్దేశం వేరే ఉందనేది బహిరంగ రహస్యం.

(రేపు: ట్రిపుల్ ఆర్ రూట్ మార్పు ఎవరికి లాభం?)




# ఫోర్త్‌సిటీ.. ఫ్యూచర్ ట్రేడింగ్?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 17 (నమస్తే తెలంగాణ): ఒకవైపు రియల్ ఎస్టేట్ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా స్తబ్దత నెలకొన్న తరుణంలో హైదరాబాద్‌కు దక్షిణ భాగాన మాత్రం అనూహ్య అలజడి కనిపిస్తున్నది. రంగారెడ్డి జిల్లా కందుకూరు, ముచ్చర్ల, తుక్కుగూడ మొదలు యాచారం వరకు భూమాయాజాలం కొనసాగుతున్నది. ఒకవైపు రాష్ట్రమంతా వ్యవసాయ భూముల ధరలు పడిపోతుంటే.. అక్కడ మాత్రం అవి ఆకాశానికి ఎగబాకుతున్నాయి. అన్ని చోట్లా ప్లాట్ల రేట్లు పడిపోతుంటే.. అక్కడ మాత్రం రెట్టింపు అయ్యాయి. ఈ వింత, విచిత్రం ఎలా సాధ్యమవుతున్నదని 'నమస్తే తెలంగాణ' ఆరా తీసినప్పుడు.. విస్తుగొల్పే నిజాలు, విస్మయపరిచే విషయాలు బయటకువచ్చాయి.

### అంతా గోప్యం.. అధికారుల మౌనం

అక్కడ వందల ఎకరాలు చేతులు మారుతున్నా అంతాగోప్యం! వేల కోట్ల దందాలు సాగుతున్నా అంతా గప్‌చుప్! పెద్దల ఒత్తిడితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవం చెప్పలేక, విషయం దాచలేక మల్లగుల్లాలు పడుతున్నారు. తమకేమీ తెలియనట్టే నటిస్తున్నారు. వారం రోజులక్రితం ఓ కీలక నేత నివాసంలో ఫ్యూచర్ సిటీపై కీలక సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ సెక్రటరీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరైన ఆ మీటింగ్‌లో రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు.. ఆ తర్వాత ఫ్యూచర్ సిటీ కోసం చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై వివరించిన సదరు నేత చివరికి ఓ హెచ్చరికతో ముగించారని సమాచారం. 'అధికారులెవరూ నోరువిప్పొద్దు. సందర్భం వచ్చినప్పుడు నేనే చెప్తా. అంతవరకు విషయం బయటకు పొక్కితే సీరియస్‌గా ఉంటుంది' అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది.

### ఫార్మా రద్దుతోనే తొలి అడుగు

ఫార్మాసిటీ రద్దుతోనే తొలి అడుగు పడింది. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో అసలు కథ మొదలైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు 19వేల ఎకరాల భూసేకరణ పూర్తిచేసి ఫార్మాసిటీ రూపొందిస్తే.. దాన్ని రద్దు చేసి అదే భూములు లక్ష్యంగా సర్కారు ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నది. కొత్త ప్రాజెక్టులను అక్కడికే తరలిస్తున్నది. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీతోపాటు ఏఐ సిటీ వంటి వాటినీ దక్షిణానికే తరలిస్తున్నది. అంతర్జాతీయ కంపెనీలకూ అక్కడే భూ కేటాయింపులు జరుపుతున్నది. ఫోర్త్‌సిటీకి ప్రభుత్వ పెద్దలే బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తుండటం గమనార్హం. ఫలితంగా మౌలిక వసతుల కల్పనంతా అక్కడికే మళ్లుతున్నది. ఆక్యుపెన్సీ లేదనే సాకుతో రాయదుర్గం ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసిన ప్రభుత్వం.. పట్టుమని పది ఆవాసాలు లేని ఫోర్త్ సిటీకి ఇప్పుడే మెట్రో రైలును నిర్మించే పనిలో తలమునకలైంది. మూడు నగరాల్లో లేనివిధంగా నాల్గోనగరిలో అవసరం లేకున్నా... 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఫ్యూచర్ సిటీ హైప్ కోసం ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నట్టు తేటతెల్లమవుతున్నది. అసలు హైడ్రా పేరుతో ట్రైసిటీలో చేపడుతున్న నిర్మాణాల కూల్చివేత కూడా భావినగరం వైపు రియల్టీ మళ్లించేందుకేనన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

## లోకం పోకడ



కంప్యూటర్ కనిపెట్టింది ఎవరని అడిగితే రాజీవ్‌గాంధీ అంటావేంరా? ఎవర్రా నీకు చెప్పింది? ఏడిచినట్లేవుంది నీ చదువు!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 35.2°c | 23.4°c |
| ఖమ్మం | 35.0°c | 21.0°c |
| మెదక్ | 34.2°c | 21.6°c |
| రంగారెడ్డి | 33.5°c | 21.1°c |
| నిజామాబాద్ | 32.9°c | 23.1°c |
| వరంగల్ | 32.0°c | 23.0°c |
| కరీంనగర్ | 32.0°c | 23.0°c |
| నల్లగొండ | 31.5°c | 24.6°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 21.5°c |
| హైదరాబాద్ | 31.0°c | 22.0°c |

# రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై ఢిల్లీ ఆగ్రహం!

**తెలంగాణతల్లికి కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటి?**

**ఇలా చేస్తే రాజీవ్‌గాంధీ గౌరవం పెరుగుతుందా?**

**ఆయనను విలన్‌గా చేయాలనుకుంటున్నారా?**

**తెలంగాణతల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదు?**

**రాష్ట్ర ముఖ్య నేతలను తలంటిన అధిష్ఠానం!**

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు అంశం కాంగ్రెస్ పార్టీలో రచ్చ రేపుతున్నది. విగ్రహ ఏర్పాటుపై అధిష్ఠానం పెద్దలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎంతో ముఖ్యమైన ఈ కార్యక్రమానికి గాంధీ కుటుంబం నుంచి ఒక్కరు కూడా హాజరు కాకపోవడానికి ఈ ఆగ్రహమే కారణమని తెలిసింది. వాస్తవానికి ఈ కార్యక్రమానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. కానీ, వారు మాత్రం రావడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర పెద్దలను అధిష్ఠానం తలంటినట్టు తెలిసింది. 'వివాదాల మధ్య రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇది రాజీవ్‌గాంధీకి గౌరవం పెంచుతుందా? తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటుచేశారు? తద్వారా తెలంగాణ ప్రజల్లో రాజీవ్ గాంధీని విలన్‌ను చేయాలని అనుకున్నారా?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. ఒకవేళ ఇదే జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించినట్టు తెలిసింది. అప్పుడు రాజీవ్ గాంధీ గౌరవం ఏం కావాలని గట్టిగానే తలంటినట్టు తెలిసింది. మాజీ ప్రధాని అయిన రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే సమయంలో అందరి ఆమోదంతో చేయాలనే కనీస ఆలోచన కూడా లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అయితే దీనిపై రాష్ట్ర నేతలు వివరణ ఇచ్చినట్టు తెలిసింది. తెలంగాణతల్లి విగ్రహాన్ని సచివాలయం లోపల ఏర్పాటు చేయబోతున్నామని, అందుకే బయట తెలంగాణతల్లికి కేటాయించిన స్థలంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్టు వివరించినట్టు తెలిసింది. ఈ వివరణపై అధిష్ఠానం పెద్దలు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. అలాంటప్పుడు ముందుగా తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేసి ఆ తర్వాత రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిందని, అప్పుడు ఈ వివాదం ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తంచేసినట్టు తెలిసింది. పేరున్న నేతలను గౌరవం పెంచకపోయినా ఫర్వాలేదు కానీ, ఉన్న గౌరవాన్ని తగ్గించే పనులు మాత్రం చేయొద్దని గట్టిగానే చెప్పినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అధిష్ఠానం తోపాటు రాష్ట్ర సీనియర్ నేతలు కూడా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది.

## దేశంలో పెరుగుతున్న కోటీశ్వరులు!

న్యూఢిల్లీ: భారత్‌లో సంపన్నుల సంఖ్య పెరుగుతున్నది. ఏడాదికి రూ.10 కోట్లు సంపాదిస్తున్న వాళ్లలో.. 63 శాతం పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూషనల్ రిసెర్చ్' తాజా నివేదిక ప్రకారం, 2019 నుంచి 2024 వరకు భారత్‌లో కోటీశ్వరుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ఏడాదికి 50 లక్షలకుపైగా సంపాదిస్తున్న సంఖ్యలో పెరుగుదల 25 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం భారత్‌లో 31,800 మంది రూ.10 కోట్లకుపైగా వార్షిక సంపాదన కలిగి ఉన్నారు. ఏటా రూ.50 లక్షలకుపైగా సంపాదిస్తున్న వాళ్ల సంఖ్యలో దాదాపు 10 లక్షల మంది పెరిగారు. రూ.5 కోట్ల సంపాదన (వార్షిక) కలిగిన వారి సంఖ్య 58,200కు చేరుకుంది. ఈ విభాగంలో కోటీశ్వరుల సంఖ్య 49 శాతం పెరిగింది.

# వరదసాయంలోనూ మెలిక

- పక్కాగాలేని వరద బాధితుల సర్వే
- 3,800 కుటుంబాలకు నష్టమని అంచనా
- 2,813 కుటుంబాలు నష్టపోయినట్టు క్షేత్రస్థాయి నిర్ధారణ
- సాంకేతిక కారణాలతో 318 కుటుంబాలకు అందని సాయం
- క్యాటగిరీలుగా విభజించి.. వందలాది మందికి మొండిచేయి
- తహసీల్దార్ కార్యాలయంలో వరద బాధితుల ఆందోళన

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 17: సవాలక్ష కొర్రీలతో అరకొరగా రుణమాఫీ చేసిన సర్కారు వరదసాయంలోనూ తన మార్క్ చూపింది. వరద బాధితులను క్యాటగిరీలుగా విభజించి వరదసాయంలోనూ మెలిక పెట్టింది. ఫోన్‌నంబర్లు ఒకేలా ఉన్నాయని, ఖాతా నంబర్లు లేవని కారణాలు చెబుతూ వరద బాధితులను నిండాముంచింది. మున్నేటి వరద తమ ఇండ్లను ముంచెత్తితే.. ఆదుకోవాల్సిన సర్కారు నిండా ముంచేసిందని మున్నేరు వరద బాధితులు మొత్తుకుంటున్నారు. ఇండ్లు మునిగినా.. పంటలు కొట్టుపోయినా.. కట్టుబట్టలతో ఉన్నా.. నష్టప్రభావం తక్కువేనని సర్కారు సాకులు చెప్తున్నదని మండిపడ్డారు. వరద బాధితులను క్యాటగిరీలుగా విభజించి పరిహారం అందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన నష్టాన్ని కండ్లారా చూసిన అధికారులు.. వివరాలన్నీ నమోదు చేసుకొని జాబితాలో పేరు కూడా పొందుపర్చారని.. కానీ ఎక్కువ ప్రభావితమైన వారికే అని కొందరి ఖాతాల్లోనే పరిహారం జమ చేస్తున్నారని ఆరోపించారు. నివాసాలు మునిగినా.. తీవ్రత ఉన్న జాబితాలో చేర్చకనే పరిహారాన్ని కోల్పోయామని బోరుమంటున్నారు.

### ఆందోళనలో వరద బాధితులు

ఖమ్మం రూరల్ మండలంలో ప్రాథమికంగా 3,800 కుటుంబాలకు నష్టం జరిగి ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. క్షేత్ర పరిశీలన తరువాత 2,813 కుటుంబాలు నష్టపోయినట్టు నిర్ధారించారు. ఒకే ఫోన్ నంబర్లు ఇవ్వడం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం, ఉన్నా నంబర్లు తెలియకపోవడం వంటి సాంకేతిక కారణాలతో 318కుటుంబాలకు సాయం అందలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ సర్వే జరగని కుటుంబాలు, అర్హత ఉన్నా పరిహారం అందని కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వరుస సెలవుల అనంతరం తెరుచుకున్న ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వరద బాధితులు వందల సంఖ్యలో చేరుకున్నారు. ఇండ్లు మునిగినా ఘటనను కండ్లారా చూసి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని అధికారులకు మొరపెట్టుకున్నారు. కొందరైతే పూర్తిగా ముంపునకు గురైన ఇండ్లు, ఇతర ఆస్తుల ఫొటోలు తీసుకొచ్చి మరీ అధికారులకు చూపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కేంద్ర, రాష్ట్ర అధికారులు ప్రత్యక్షంగా చూసినా పరిహారం ఇవ్వకపోవడంపై వరద బాధితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో అధికారులు బాధితుల నుంచి మరోసారి దరఖాస్తులు స్వీకరించారు.



ఖమ్మం రూరల్ మండల ఆర్‌ఐ ఎదుట మొరపెట్టుకుంటున్న పరిహారం అందని మున్నేటి వరద బాధితులు

### అధికారులు కండ్లారా చూశారు



మా ఇల్లు మునిగిన విషయాన్ని అధికారులు కండ్లారా చూశారు. సర్కారు సాయం చేసే జాబితాలో మా పేరు లేదు. వరద తగ్గిన తరువాత ఒక్కరిద్దరు అధికారులు వచ్చారు. వివరాలన్నీ మా ఇంటి దగ్గరే నమోదు చేసుకున్నారు. కానీ మాకు పరిహారం రాలేదు. సర్కారు సాయం రూ.16 వేలు అందినోళ్లకే స్థానిక నాయకులు రూ.5 వేలు ఇచ్చారు. జాబితాలో పేరు లేదని మాకు అది కూడా రాలేదు.

–అమృతమ్మ, ఆర్టీసీ కాలనీ

### మా ఇల్లు పూర్తిగా మునిగింది



మున్నేటి వరదలకు మా కేబీఆర్ నగర్ కాలనీ పూర్తిగా మునిగింది. మా ఇంట్లో దాదాపు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లింది. సర్వే అధికారులు వచ్చి చూశారు. వాళ్లు కూడా చాలా బాధపడ్డారు. కానీ నా ఖాతాలో పరిహారం జమ కాలేదు. ఎందుకని అడిగితే జాబితాలో నా పేరు క్యాటగిరీ-1లో ఉందని సమాధానమిచ్చారు.

–బూడిద వెంకన్న, కేబీఆర్ నగర్

### మళ్లీ సేకరిస్తున్నాం..

**మున్నేటి** వరదలకు మండలంలో ప్రాథమికంగా 3,800 కుటుంబాలకు ఆస్తి నష్టం జరిగినట్టు తొలుత అంచనా వేశాం. క్షేత్ర పరిశీలన తరువాత 2,813 కుటుంబాలకు ఆస్తి నష్టం జరిగినట్టు నిర్ధారణ అయింది. ఒకే ఫోన్ నెంబర్లు ఇవ్వడం, బ్యాంకు ఖాతాల నెంబర్లు ఇవ్వకపోవడం వంటి సాంకేతిక కారణాలతో 318 కుటుంబాలకు పరిహారం రాలేదు. వారి వివరాలు మళ్లీ సేకరిస్తున్నాం.

– రాంప్రసాద్, తహసీల్దార్, ఖమ్మం రూరల్



హైవేపై బోల్తాపడిన కారును స్థానికులతో కలిసి సరిచేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్యే

- ఇటిక్యాలపాడు హైవేపై కారు బోల్తా
- గాయపడిన వ్యక్తికి ధైర్యం చెప్పి ప్రథమ చికిత్స చేయించిన విజయుడు

ఉండవెల్లి, సెప్టెంబర్ 17 : ప్రమాదవశాత్తు కారు బోల్తాపడగా అదేసమయంలో అటు నుంచి వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆగి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడికి ధైర్యం చెప్పారు. దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వివరాలు ఇలా.. కర్నూల్ జిల్లా నందవరం మండలం పులచింతకు చెందిన నవీన్‌కుమార్ కారు కొనుగోలు చేశాడు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి క్షేత్రంలో పూజలు చేయించిన అనంతరం తిరిగి కర్నూల్ వైపు బయలుదేరాడు. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు హైవేపై ప్రమాదవశాత్తు బోల్తాపడింది. అందులోని నవీన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అదే సమయంలో గద్వాల కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవానికి హాజరై తిరిగి వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తన కారును ఆపి.. బోల్తాపడిన కారును స్థానికుల సాయంతో సరిచేశారు. గాయపడిన నవీన్‌కు స్థానిక దవాఖానలో ప్రథమ చికిత్స అందించి తిరిగి పంపించారు. సాయం చేసిన ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

## ఫిరాయింపులను ప్రోత్సహించడమే ప్రజాపాలనా?

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ప్రజా పాలన అంటే పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించడమేనానని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ ప్రశ్నించింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడంపై వారు స్పందించారు. ప్రజాపాలన అంటే పార్టీలు ఫిరాయిపులను ప్రోత్సహిస్తూ వీధి రౌడీల్లా తన్నుకోవడమా అని ప్రశ్నించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రజాప్రతినిధుల సభ్యత్వాలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై బీఎన్‌రెడ్డి, మద్దికాయల ఓంకార్ విగ్రహాలు పెట్టాలని కోరారు. నల్గొండ యూనివర్సిటీకి, ఎస్సారెస్పీ రెండో దశకు బీఎన్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్- నర్సంపేట రహదారి, మెడికల్ కాలేజీకి, నర్సంపేట స్టేడియానికి ఓంకార్ పేరు పెట్టాలని కోరారు. ప్రజానేతలు భీంరెడ్డి నరసింహారెడ్డి-ఓంకార్‌ల స్మారకార్థం హైదరాబాద్‌లో 5, సూర్యాపేటలో 2, నర్సంపేటలో 2ఎకరాలు ప్రభుత్వం కేటాయిస్తే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనకు గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఎంసీపీఐ(యూ)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు.

### ఐఐటీ బాంబేకు 130 కోట్ల విరాళం

బెంగళూరు, సెప్టెంబర్ 17: మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఐఐటీ బాంబేకు మంగళవారం రూ.130 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఆర్థిక రంగ వృద్ధికి తోడ్పడే విధంగా మోతీలాల్ ఓస్వాల్ సెంటర్ ఫర్ క్యాపిటల్ మార్కెట్స్‌ను క్యాంపస్‌లోక్యాంపస్‌లో నెలకొల్పనున్నారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేయాలని ప్రణాళికలు రచిస్తున్నది.




మిర్యాలగూడలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న గురుకుల అధ్యాపకులు

## కొత్త టైమ్‌టేబుల్ అమలుచేయాలి

**గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ - నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన**

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ చేసింది. కొత్త టైమ్‌టేబుల్‌ను వెంటనే అమలుచేయాలని, అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలని, విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి రాష్ట్రవ్యాప్తంగా గురుకుల అధ్యాపకులు విధులకు హాజరయ్యారు. జేఏసీ స్టీరింగ్ కమిటీ నేతలు బాలరాజు, యాదయ్య, మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో 28న విధులను బహిష్కరించి, పెన్‌డౌన్ / చాక్‌డౌన్ నిర్వహిస్తామన్నారు.